# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-01-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు విశాఖలో 2 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటూ, మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ కేంద్రానికి శంఖుస్థాపన చేయనున్నారు

2. రాష్ట్రంలో కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు పేర్కొన్నారు.

3. మెట్రో విస్తరణకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

4. ఆంధ్రప్రదేశ్ లో అన్ని గిరిజన గ్రామాలను రహదారులతో అనుసంధానం చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

5. తెలంగాణలోని ఇంటర్ కళాశాలలకు ఈ నెల 13 వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది

=========================

జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లో భాగంగా భారత దేశపు మొట్ట మొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్ కు ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నంలో శంఖుస్థాపన చేయనున్నారు. ప్రధానమంత్రి ఈరోజు మధ్యాన్నం విశాఖపట్నానికి రానున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి దోహదపడే దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తో సహా పలువురు ప్రముఖులు ప్రధానమంత్రితో వేదిక పంచుకోనున్నారు…మరింత సమాచారాన్ని మా ఆకాశవాణి విశాఖపట్టణం ప్రతినిధి సత్యన్నారాయణ అందిస్తారు.

వాయిస్( 37 సెకన్లు )

విశాఖపట్నం చేరుకున్నాక ముందుగా సిరిపురంలోని వెంకటాద్రి వంటిల్లు నుంచి ఒక కిలోమీటర్ మేర నిర్వహించే రోడ్ షో లో పాల్గొంటారు. అనంతరం సభా ప్రాంగణం వద్దకు చేరుకుంటారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో విశాఖలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటూ పలు ట్రాఫిక్ ఆంక్షలను విధించారు.

-------------------------

రాష్ట్రంలో కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో పర్యటించిన ఆయన నిన్న జననాయకుడు కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం చంద్రబాబు నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

మెట్రో విస్తరణలో భాగంగా చేపట్టిన శామీర్‌పేట, మేడ్చల్ మార్గాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, కారిడార్ల నిర్మాణాలపై నిన్న తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, శామీర్‌పేట, మేడ్చల్ మార్గాలకు సంబంధించి భూసేకరణ వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ ప్రాజెక్టులకు అనుమతులు పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని ముఖ్యమంతి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

పాఠశాల విద్యలో నాణ్యత పెంచేలా నూతన పాఠ్య ప్రణాళికలు రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. గుంటూరుజిల్లా, ఉండవల్లిలో 2025 -26 విద్యాసంవత్సరం పాఠ్యప్రణాళికపై సంబంధిత శాఖాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. సెమిస్టర్ల వారీగా పాఠ్య పుస్తకాలను రూపొందించాలని,. ఒక సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్యంశాలన్నీ ఒకే పుస్తకంగా తీసుకొచ్చే అంశాన్నీ పరిశీలించాలన్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు జనవరి కల్లా పూర్తి చేసేలా క్యాలెండర్‌ను రూపొందించాలని చెప్పారు. విద్యా సంస్కరణల కోసం నిపుణులు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అన్ని గిరిజన గ్రామాలను రహదారులతో అనుసంధానం చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 100 రోజుల్లో 100 కచ్చా రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచాడవలస పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన రహదారులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. పాచిపెంట మండలంలో రహదారుల నిర్మాణానికి 3 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.

వాయిస్ 27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఈ రోజు, రేపు కేంద్ర బృందం పర్యటించనుంది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి పెరిన్ దేవి నేతృత్వంలోని బృందం కరువు మండలాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయనుంది. పర్యటనలో భాగంగా అన్నమయ్య,

చిత్తూరు, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలలోని కరవు మండలాల్లో కేంద్రబృంద సభ్యులు మూడు బృందాలుగా పర్యటించి క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణలోని కళాశాలలకు ఇంటర్మీడియట్ బోర్డు సంక్రాంతి సెలవులను ప్రకటించింది. ఈ నెల 13 వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు ఇంటర్ కళాశాలలకు సెలవులు మంజూరు చేస్తూ ప్రకటన విడుదల చేసింది. 17న తిరిగి కళాశాలలు ప్రారంభమవుతాయని,. సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు కళాశాలలు ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని తెలిపింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని బోర్డు స్పష్టం చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో పొడి వాతావరణం కొనసాగుతుందని, కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి వి ఎస్ ఎం రాజు తెలుపుతూ

వాయిస్ 16 సెకన్లు

తెలంగాణలోనూ చలి గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

---------------------------

తెలంగాణలో సంచార భూసార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ రంగాలపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సంవత్సరం రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వివిధ అంశాలపై మంత్రి చర్చించారు. సన్న, చిన్న కారు రైతులు ప్రయోజనాలు పొందేలా వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ సేద్య పరికరాలకు మరింతగా ప్రోత్సాహం అందించాలన్నారు. రైతు వేదికల నిర్వహణకు నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

=====================